క్లుప్తంగా

గొండుపాలెంలో సతకం పట్టు వద్ద పూజలు

కె.కోటపాడు : గొండుపాలెం గ్రామస్తులు పసలమ్మ పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఖరీఫ్ కాలంలో పండగను నిర్వహిస్తుండడం ఆచారంగా వస్తుంది. గ్రామంలో గల మహిళలు సతకం పట్టు వద్ద గల వేపచెట్టుకు పూజా కార్యక్రమాలను జరిపారు. అనంతరం గ్రామంలో వసంతకోత్సవం నిర్వహించారు. ఈ వసంతకాన్ని పశువుల పాకల్లోను, పంట పొలాల్లోను, పశువులపైనా రైతులు చల్లారు. పశువులకు మంచి ఆరోగ్యంతో పాటు మంచి దిగుబడితో కూడిన పంటలు పండాలని రైతులు కోరుకున్నారు.

8వేల ఎకరాల్లో ఈ పంట నమోదు పూర్తి

మాకవరపాలెం: మండంలో 8వేల ఎకరాల్లో ఈ పంట నమోదు పూర్తయిందని ఏవో చిరంజీవి తెలిపారు. మండల వ్యాప్తంగా 12వేల ఎకరాల్లో ఈ పంట నమోదు చేయాల్సి ఉందన్నారు. ఈ పంట నమోదు చేయించుకున్న రైతులంతా తప్పనిసరిగా ఈ కేవైసీ చేయించుకోవాలన్నారు. లేకుంటే ప్రభుత్వం అమలు చేసే రాయితీలు అందవని స్పష్టం చేశారు. రైతులు స్థానికంగా ఉన్న రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఈ కేవైసీ చేయించుకోవాలన్నారు.

పరిశుభ్రతతో అంటువ్యాధులు దూరం



కె.సంతపాలెంలో ప్రజలకు కరపత్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో అప్పలరాజు

కె.కోటపాడు : ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడాన్ని బాధ్యతగా గుర్తించాలని ఎంపీడీవో ఎస్.అప్పలరాజు అన్నారు. కె.సంతపాలెం గ్రామంలో ఆదివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. వర్షాల సమయంలో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఇంటి పరిసరాల్లో మురుగునీరు లేకుండా చూసుకోవాలన్నారు. సర్పంచ్ చల్లా మంగ తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే ఎంతో ప్రమాదం



కొరువాడ సమీపంలో రోడ్డు మధ్యలో ఛిద్రమవుతున్న ప్రాంతం

కె.కోటపాడు : కొరువాడ-డి.అగ్రహారం గ్రామాల మధ్య రోడ్డు ఛిద్రమవుతోంది. అధిక బరువుతో కూడిన వాహనాలు ఈ మార్గంలో ప్రయాణించడం వల్ల కొరువాడ సమీపంలో గల రోడ్డు దెబ్బతిన్నది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఇది మరింత ధ్వంసమై వాహనదారులకు ఈ రోడ్డుపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. దగ్గరకు వచ్చే వరకూ రోడ్డు దుస్థితిని ఊహించని వాహనదారులు వాహనాన్ని అదుపు చేయలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు తక్షణం స్పందించి ఛిద్రమైన రోడ్డు ప్రాంతాల్లో పరిశీలించి, మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

స్కూల్ గేమ్స్‌లో ఆశ్రమ విద్యార్థుల ప్రతిభ

మాడుగుల రూరల్ : మండలంలో కింతలి హైస్కూల్లోఈ నెల 19, 20, 21, తేదీల్లో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీల్లో నర్సయ్యపేట గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత బాలుర పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. వాలీబాల్ సీనియర్స్ అండర్ 17 విభాగంలో ప్రథమ స్థానం, జూనియర్స్ అండర్ 14 విభాగంలో ప్రథమ స్థానం, షాట్‌పుట్‌లో ప్రథమ బహుమతి సాధించారని పాఠశాల హెచ్ఎం బావరాజు అప్పారావు ఆదివారం తెలిపారు. వారికి శిక్షణ ఇచ్చిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.సుబ్బారావును ఈ సందర్భంగా హెచ్ఎం అభినందించారు. విజేతలైన విద్యార్థులను అనకాపల్లి గిరిజన సంక్షేమ అధికారి వి. నాగశిరీష, పాఠశాల చైర్మన్ అప్పారావు, ఉపాధ్యాయులు అభినందించారు. వీరు ఈ నెల 26, 27, తేదీల్లో చొడవాడ హైస్కూల్లో జరిగే నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎం తెలిపారు.

ఆనకట్ట ఇలా... ఆయకట్టుకు నీరెలా!



జలాశయం గర్భంలో పాక్షికంగా దెబ్బతిన్న పైపులైన్

- శిథిలమైన పెద కల్యాణం ఆనకట్ట
- 1200 ఎకరాల ఆయకట్టుకు అందని సాగునీరు
- పునఃనిర్మాణం కోసం దశాబ్దాలుగా ఎదురుచూపులు



కట్ట దగ్గరలో చెక్కు చెదరని పైపులైను



కోనాం ట్రైబల్ హాస్టల్ వెనుక శిథిలమైన పైపులైను

చీడికాడ : కోనాంలోనే జలాశయం ఉన్నా ఆ గ్రామ ఆయకట్టు భూములకు చుక్కనీరు సాగునీరు అందదు. ఆ లోటును తీర్చింది పెద కల్యాణం ఆనకట్ట. అయితే జలాశయం నిర్మాణానికి ముందు నుంచి కోనాం, మంచాల, చీడికాడ కొంత భూములకు సాగు నీరందించిన పెదకల్యాణం బొడ్డేరుపై 35 ఏళ్ల క్రితం నిర్మించారు. అది పదేళ్ల పాటు నిరాటంకంగా ఏడు వందల ఎకరాల కోనాం, మంచాల, గదబూరు, చీడికాడ భూములకు నీరందించి సస్యశ్యామలం చేసింది. ప్రస్తుతం ఆ ఆనకట్ట నేతల నిర్లక్ష్యానికి గురై శిథిలమైంది. వివరాల్లోకి వెళితే కోనాం పంచాయతీ చెరకుబిల్లి సమీపంలో బొడ్డేరుపై 35 ఏళ్ల క్రితం కోనాంకు చెందిన చలుగు కుటుంబీకుడు భీమునాయుడు, చీడికాడకు చెందిన బొడ్డు మోదునాయుడుల కృషితో పెద కల్యాణం ఆనకట్ట నిర్మాంచారు. కోనాం జలాశయానికి ఏడాది పొడవునా నీరు అందించే బొడ్డేరుకు అడ్డంగా నిర్మించిన ఆనకట్ట అవడంతో వర్షా కాలం, తుపాను సమయాల్లో కట్ట గర్భంలో పూడికలు పెరిగిపోవడంతో పాటు పైపులైన్‌లో అక్కడక్కడ పగుళ్లు ఏర్పడేవి. అప్పట్లో వీటిని నిర్లక్ష్యం చేయ్యడంతో ఇరవై ఏళ్ల క్రితం జలాశయ గర్భంలో పైపులైన్ కూలిపోయింది. నాటి నుంచి దీనిని ఎవరూ పట్టించుకోలేదు. దీంతో పలు చోట్ల పైపులైన్‌లు శిథిలమయ్యాయి. 2005లో దీనిని పునఃనిర్మించేందుకు రూ.30 లక్షల నిధులతో పునఃనిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు పంపించారు. అవి కాగితాలకే పరిమితం కావడంతో 2012 నీలం, లైలా తుపానులో ఆనకట్టకు భారీ గండికొట్టి కట్ట మొత్తం కొట్టుకుపోయింది. దీంతో పాటు నీటి విడుదల గేటు పూడికపోయి తలుపులు కొట్టుకు పోయాయి. ఈ నేపథ్యంలో ఆనకట్టను పూర్తి స్థాయిలో పునఃనిర్మించాల్సి ఉంది.

మరో 600 ఎకరాలకు మేలు

ఈ కట్టను పైపులతో కాకుండా సిమ్మెంట్ దొనెలతో ఆధునికీకరించి నిర్మిస్తే చీడికాడ, మంచాలలో మరో ఆరు వందల ఎకరాలకు రెండు పంటలకు సాగునీరు అందించవచ్చు. 2016లో మరోమారు ఇరిగేషన్ అధికారులు ఈ ఆనకట్ట మీడియం ప్రాజెక్టు కిందికి వస్తుందని, కాబట్టి ఈ ప్రాజెక్టు నిర్మాణానికి సుమారు రూ.50 లక్షలు అవసరం అవుతుందని జై.కా (జపాన్ కంపెనీ)కి ప్రతిపాదనలు పంపించారు. అయితే వాటికి సంబంధించి నేటికీ ఎటువంటి సమాచారం లేదు. కట్ట పునః నిర్మిస్తే కోనాం,మంచాల పంచాయతీల్లో వందల ఎకరాలకు సాగునీరు అందించవచ్చు.



నీలం తుపాన్‌కు కొట్టుకుపోయిన పెద కల్యాణం కట్టు

రూ.కోటితో ప్రతిపాదనలు?

దీనిపై ఇరిగేషన్ ఏఈ జైరాంను సంప్రదించగా ఈ ప్రాజెక్టు విషయం ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టగా వారు పునఃనిర్మించేందుకు సుమారు రూ. కోటి రూపాయలతో ప్రతిపాదనలు పంపించినట్టు తెలిసిందన్నారు.

త్వరలో ఉద్యమిస్తాం..



కట్ట దెబ్బతిన్న నాటి నుంచి అధికారులు పెద్దగా దృష్టి పెట్టలేదు. పలుమార్లు ఎంపీలు, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది. త్వరలో కోనాం, మంచాల, గదబూరు రైతులతో కట్ట పునఃనిర్మాణం కోసం ఒక ఉద్యమం చేపడతాం.

–ఇసింశెట్టి దేముడు, రైతు, మంచాల గ్రామం

ఆనకట్ట నిర్మిస్తే రెండు పంటలకు నీళ్లు



ఈ ఆనకట్ట నిర్మాణం జరిగితే కోనాం, మంచాల, గదబూరు, చీడికాడ గ్రామాల్లో గల బీడు భూములకు ఖరీఫ్, రబీ రెండు పంటలకు సాగునీరు అందుతుంది. ఆ దిశగా అధికారులు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలి. ఈ కట్ట నిర్మాణం వల్ల రైతులకు జరిగే మేలును అందులో పొందుపరచాలి.

– సలుగు పెదసత్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ సభ్యులు, కోనాం

బాలికల హాస్టల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

- సీట్ల మంజూరులో రిజర్వేషన్ల అమలు
- మండల విద్యాశాఖాధికారి జానుప్రసాద్



జె.నాయడుపాలెంలో బాలికల వసతి గృహం

రోలుగుంట : మండలంలోని జె.నాయుడుపాలెం గ్రామంలో గల బాలికల వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, సీట్లు మంజూరులో అవకతవకలకు చోటు లేకుండా రిజర్వేషన్ ప్రక్రియ అమలు చేయడం జరుగుతుందని మండల విద్యాశాఖాధికారి జాను ప్రసాద్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. జె.నాయుడుపాలెం గ్రామంలో రూ.2.45 కోట్లు ఏపీడబ్ల్యూఐడీఈ నిధులతో అన్ని హంగులతో భవనం నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఈ విద్యా సంవత్సరం వృథా కాకుండా విద్యార్థులకు మేలు చేసే విధంగా ఇక్కడ ప్రవేశాలకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని జిల్లా విద్యాశాఖ, ఎక్స్ అఫిషియో ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ప్రొసీడింగ్సు ఏపీ సమగ్ర శిక్ష అనకాపల్లి అధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ ఉత్తర్వులు జారీ చేశారు. అనాథలు, బెంచ్‌మార్కు వైకల్యాలు, స్కూల్ డ్రాపవుట్‌లకు మొదటి ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందని, మిగిలిన సీట్లు రిజర్వేషన్లను అనుసరించి ఇతర అభ్యర్థులతో భర్తీ చేస్తామని తెలిపారు. ఈ నెల 30 తేదీలోపు ఈ ప్రక్రియ పూర్తి కావల్సి ఉందని, అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పూర్తి వివరాలకు స్థానిక హెచ్ఎం, మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

గురుకులంలో అవకతవకలపై ఫిర్యాదు

దేవరాపల్లి : తెనుగుపూడిలోని డా.బిఆర్.అంబేడ్కర్ బాలుర గురుకుల విద్యాలయంలో అవకతవకలు జరిగాయంటూ బి.కిశోర్ అనే వ్యక్తి సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. వివరాలిలా ఉన్నాయి. గత విద్యా సంవత్సరంలో ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్య పుస్తకాలను బ్లాక్‌లో అమ్ముకున్నారని, నాడు-నేడు కింద సరఫరా చేసిన బెంచీల్లో కొన్ని మరమ్మతులకు గురి కాగా, బాగు చేయించకుండా అక్రమంగా విక్రయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈనెల 8న నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి హాజరైన దళితులైన తల్లిదండ్రులను కటిక నేలపై కూర్చోబెట్టి అవమాన పరిచే రీతిలో ప్రిన్సిపాల్ జయప్రకాష్ వ్యవహరించారని ఫిర్యాదులో ఆరోపించారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో స్థానికంగా ఉండాలని ఉన్నతాధికారుల ఆదేశాల బేఖాతరు చేస్తూ ప్రిన్సిపాల్ విధులకు హాజరు కాలేదన్నారు. దీనిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే విషయమై గురుకుల విద్యాలయాల జిల్లా సమన్వయ అధికారి ఎస్.రూపావతిని ఫోన్ ద్వారా వివరణ కోరగా ప్రిన్సిపాల్‌పై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టి, రుజువైతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు.

శ్రమదానంతో జంగిల్ క్లియరెన్స్



మామిడిపల్లిలో జంగిల్ క్లియరెన్స్ పనులను పర్యవేక్షిస్తున్న జెడ్పీటీసీ కర్రి సత్యం తదితరులు

దేవరాపల్లి : మామిడిపల్లి గ్రామంలో గ్రామస్తులు శ్రమదానంగా ఆదివారం జంగిల్స్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. గ్రామస్తులంతా స్వచ్ఛందంగా రోడ్డు ఇరువైపులా ఏపుగా ఎదిగిన తుప్పలను డొంకలను తొలగించి శ్రమదాన స్ఫూర్తిని చాటారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుకు ఇరువైపులా డొంకలు పెరగడంతో అటుగా ప్రయాణించే వాహన చోదకులు, ప్రయాణికులకు తగలడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరగడంతో మామిడిపల్లి గ్రామస్తులంతా ఐక్యంగా జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టేందుకు సంకల్పించారు. వృద్ధులు, మహిళలతో పాటు యువకులు సైతం కత్తి, కర్ర పట్టుకొని గ్రామానికి ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. ఈ పనుల్లో స్థానిక జెడ్పీటీసీ కర్రి సత్యం, ఎంపీటీసీ పంచాడ సింహాచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలు కండి



బుచ్చెయ్యపేటలో రక్తదానంపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ, యువకులు

బుచ్చెయ్యపేట : రక్తదానం చేసి ఆపదలో ఉన్న మరొకరి ప్రాణాలు కాపాడాలని ఎస్ఐ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం రాత్రి మండల కేంద్రం బుచ్చెయ్యపేట, దిబ్బిడి గ్రామాల్లో వడ్డాదికి చెందిన అమ్మ హెల్పింగ్ హార్ట్స్ సేవా సంస్థ అక్టోబర్ 2వ తేదీన గాంధీ జయంతి రోజు చేపట్టిన మెగా రక్తదాన శిబిరం విజయవంతం చేయాలని ఎస్ఐ యువకులతో కలిసి వీధుల్లో ప్రచారం చేశారు. వడ్డాది కోవెల అప్పనదొర జిల్లా పరిషత్ హైస్కూల్లో వెయ్యి మందితో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని మహిళలు, యువకులు అందరూ పాల్గొని రక్తదానం చేసి ఆపదలో ఉన్న వేలాది మందిని ఆదుకోవాలని ఎస్ఐ కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర రక్తదాన సేకరణ టీం లీడర్ బాలుతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పలువురు యువకులు పాల్గొన్నారు.

రోడ్డుకిరువైపులా తుప్పల తొలగింపు

చీడికాడ : మండలంలో స్వచ్ఛతా కార్యక్రమంలో భాగంగా, రహదారుల కిరువైపులా వున్న జంగిల్ తొలగించారు. వరహాపురం నుంచి దామునాపల్లి గ్రామం వరకు రహదారి కిరువైపులా పేరుకు పోయిన పిచ్చి తుప్పలను తొలగించి శుభ్రం చేశారు. ఆర్అండ్‌బీ జేఈ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఈ పనులు నిర్వహించారు. దీంతో రహదారి గుండా వాహనాలు తిరగడానికి ఇబ్బందులు తొలగాయని ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎండుతున్న వరినాట్లు

మాడుగుల రూరల్ : వారం రోజులుగా ఎండ తీవ్రతతో ఇటీవల వేసిన వరినాట్లు ఎండిపోతున్నాయి. పది రోజుల క్రితం తుఫాన్ వర్షాలకు వరి పంట నిండా పుష్కలంగా నీరు చేరింది. అయితే వారం రోజులుగా వేసవి ఎండలకు దీటుగా ఎండలు కాస్తున్నాయి. దీంతో వరినాట్లు ఎండిపోతున్నాయి. గతంలో అతివృష్టి, నేడు అనావృష్టితో రైతులు బాధపడుతున్నారు. విద్యుత్ పంపు సెట్లు ద్వారా నీటి తడులు పెట్టుకుంటూ పంటను కాపాడుకుంటున్నారు.

వరిలో పచ్చ పురుగు తెగులు నివారించుకోండి



రోలుగుంట పొలంలో సోకిన పచ్చపురుగు తెగులు

రోలుగుంట : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరి పొలాలను తెగుళ్ల ఆశించాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తెగుళ్ల సోకిన పొలాలను మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి సందర్శించి, రైతులకు తగు సూచనలు అందించారు. పొలంలో నిండుగా నీరు నిలిచిపోవడంతో పొలం ఏపుగా ఎదిగి పచ్చపురుగ తెగులు సోకిందన్నారు. ఒక దుబ్బుకి రెండు లేదా మూడు ఆకులు తెల్లగా గీకబడి, అందులో లార్వాలు కనిపిస్తే వంద దుబ్బుల్లో కనీసం అయిదు పైగా ఇలా కనిపిస్తే మందులు పిచికారి చేసుకోవాలని సూచించారు. ఎకరాకు కనీసం 15 నుంచి 20 చోట్ల పొలంలో అక్కడక్కడ పక్షి స్థావరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. దీని వల్ల పురుగు ఉధృతి తగ్గుతుందన్నారు. పురుగు ఉధృతి అయిదు శాతం మించి ఉంటే పురుగు మందుల పిచికారి ముందు పొడవాటి తాడు ఇద్దరు పట్టుకొని ఎదురెదురు గట్లపై గాని, పొలం మధ్యలో నడుచుకుంటూ పొలానికి అడ్డుగా తాడును వరి ఆకుల మీద నుంచి లాగినట్టయితే ముడుచుకొని ఉన్న ఆకుల్లో ఉన్న పురుగు రాలిపోతుందని తెలిపారు. వరిలో ఆకుముడత ఆశించిన వెంటనే లక్షణాలు గమనించాక లేదా ఆకుముడత తొలి దశలోనే రెండు గ్రాముల కార్టాప్ హైడ్రో క్లోరైడును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని, లేదా ఎకరానికి 400 గ్రాముల కార్టాఫ్ పొడిమందు వినియోగించాలని సూచించారు. రైతులు వ్యవసాయ సిబ్బంది సూచనలు, సలహాలు పాటించి తెగుళ్ల నివారించుకోవాలన్నారు.

కనకదుర్గమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు



వంటర్లపాలెం తాచేరు నది ఒడ్డున్న గల కనకదుర్గమ్మ ఆలయం



ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ అమ్మవారు

మాడుగుల రూరల్ : వంటర్లపాలెం తాచేరు నది ఒడ్డున్న గల కనకదుర్గమ్మ ఆలయంలో శరనవ రాత్రి ఉత్సవాలు వచ్చే నెల 3 వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ కమిటీ చైర్మన్, గురు భవానీ దండి నర్సింగరావు ఆదివారం తెలిపారు. ఆలయం మందు భాగంలో దాతల సహకారంతో షెడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా తొలి రోజు అమ్మవారి చిత్రపటం గ్రామంలో ఊరేగింపు, సాయంత్రం భజన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఉత్సవాలు వచ్చే నెల 12 వ తేదీ దసరా వరకు ప్రతి రోజు నిత్య పూజలు, అభిషేకాలు, జలాభిషేకాలు, చండీ యాగం, మాలాధారణ భక్తులు ఆధ్వర్యంలో భజన కార్యక్రమం, చద్ది ఏర్పాటు చేస్తున్నట్టు చైర్మన్ తెలిపారు. దుర్గమ్మ మాలాధారణ కార్యక్రమం ఆలయం వద్ద జరుగుతుందని, భక్తులు మాలాధారణ వేసుకోవాలంటే ఆలయం వద్దకు రావాలని పూర్తి వివరాల కోసం 9000641853 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఆలయం వద్ద ఆధ్యాత్మిక, సంస్కాతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.

ఈ రోడ్డుపై ప్రయాణించేదెలా!



వెంకయ్యపాలెం- గాంధీనగరం రోడ్డు దుస్థితి

నాతవరం : మండలంలో జిల్లేడుపూడి పంచాయతీ శివారు వెంకయ్యపాలెం నుంచి గాంధీనగరం వెళ్లే మధ్య తాండవ కాలువ గట్టు రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈరోడ్డులో ప్రయాణించే వాహనదారులు అనేక బాధలు పడుతున్నారు. జిల్లేడుపూడి నుంచి గాంధీనగరం వరకు తాండవ కాలువ గట్టుపై మెటల్‌రోడ్డు నిర్మించారు. రాకపోకలు సాగించేందుకు చాలా అనుకూలంగా ఉండేది. లక్ష్మీపురం, జిల్లేడుపూడి, వెంకయ్యపాలెం, గోవిందపురం, చెర్లోపాలెం పార్వతీపురం, సీతారాంపురం, కోటవురట్ల మండలం పాములవాక, కొత్తూరు తదితర గ్రామాల ప్రజలు తుని కోటనందూరు మండలాలు వెళ్లడానికి ఇది చాలా దగ్గర దారి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు నిత్యం ఈ రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈరోడ్డు పూర్తిగా శిథిలమై బురదమయంగా తయారైంది. రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

సత్తా చాటిన గురుకుల విద్యార్థులు



కీడా పోటీల విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎంఈవో పడాల్‌దాస్

దేవరాపల్లి : దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు జరిగిన మండల క్రీడా పోటీలు ముగిసాయి. ఈ పోటీలలో తెనుగుపూడి డా.బీఆర్. అంబేడ్కర్ గురుకుల విద్యాలయం విద్యార్థులు అండర్-17 బాలుర విభాగంలో ఖోఖో, వాలీబాల్, చెస్‌లో విజేతలుగా నిలిచారు. షటిల్ బ్యాడ్మింటన్‌లో దేవరాపల్లి హైస్కూల్ విద్యార్థులు, కబడ్డీలో దేవరాపల్లి కైరోస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. అండర్-14, అండర్-17 బాలికల విభాగంలో డిస్కస్ త్రోలో ఎ. కొత్తపల్లి హైస్కూల్ విద్యార్థులు ఎస్.నాగమణి, పి.అఖిల విజేతలుగా నిలిచారు. అండర్-14, అండర్-17 బాలుర విభాగంలో డిస్కస్ త్రోలో ఎ. కొత్తపల్లి హైస్కూల్‌కు చెందిన సతీష్, జశ్వంత్ విజేతలుగా నిలిచారు. అండర్-17 బాలికల 600 మీటర్ల రన్నింగ్‌లో వేచలం హైస్కూల్ విద్యార్థిని రామలక్ష్మి, 800 మీటర్ల రన్నింగ్‌లో కేజీబీవీ విద్యార్థిని శ్రీలక్ష్మి, 100 మీటర్ల కేజీబీవీ విద్యార్థిని టి.శ్రీలక్ష్మి విజేతలుగా నిలిచారు. అండర్-17 బాలుర 100 మీటర్ల రన్నింగ్‌లో వేచలం విద్యార్థి బి. చైతన్య, అండర్-14 100 మీటర్ల రన్నింగ్‌లో వేచలం విద్యార్థిని టి.సిమ్రాన్, అండర్-17లో 200 మీటర్ల బాలికల విభాగంలో వేచలం విద్యార్థి బి. చైతన్య విజేతలుగా నిలిచారు. వీరికి ఎంఈవో బి.పడాల్‌దాస్, వి. ఉషారాణి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఈటీ జి.తరుణేశ్వరరావు, పీడీలు బి.బాబూరావు, ఆర్.తమ్మునాయుడు, సూర్యప్రకాష్, కుమారి, కె.కృష్ణ, ఎస్.నాగేశ్వరరావు, కె.విజయ్,సంతోష్ పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



పొలం పిలుస్తోంది గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

దేవరాపల్లి: అన్ని గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించి ప్రగతి బాట పట్టిస్తానని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణమూర్తి అన్నారు. మండలంలోని ఎన్.గజపతినగరం, వేచలం గ్రామాలలో ఆదివారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో జరిగిన సమావేశాలలో మాట్లాడుతూ గ్రామాలలో అవసరమైన చోట సీసీ రోడ్లు, డ్రైనేజీలు, శ్మశాన వాటిక రోడ్లు, ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానన్నారు. అనంతరం ఎన్. గజపతి నగరంలో పొలం పిలుస్తొంది గోడ పత్రికను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ద్వారా ఆధునిక పద్ధతుల ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. మండల ప్రత్యేక అధికారి వి.రవీంద్రనాథ్, ఏవో కాంతమ్మ, ఎంఈవో పడాల్‌దాస్, నాయకులు గవిరెడ్డి రామానాయుడు, పైలా ప్రసాదరావు, చిటిమిరెడ్డి సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు గడువు నేటి వరకే

- ఈ కేవైసీ గడువు ఈ నెల 28 వరకూ
- మండల వ్యవసాయాధికారి విజయలక్ష్మి



మండల వ్యవసాయాధికారి విజయలక్ష్మి

రోలుగుంట : ప్రభుత్వం నిర్ణయించిన ఈ-క్రాప్ నమోదు సోమవారంతో ముగియనుంది. అలాగే ఈ-కేవైసీకి ఈ నెల 28 తో గడువు ముగియనుంది, రైతులు ఈ తేదీలలోపు వ్యవసాయ సిబ్బంది వద్ద తమ వివరాలు నమోదు చేయించుకొని ప్రభుత్వ రాయితీలు, ప్రభుత్వ పథకాలు పథకాలు పొందడానికి అర్హత పొందాలని మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ- పంట నమోదు చేయించుకున్న రైతు ఈ-కెవైసీ చేయించుకుంటేనే ఈ-పంట ప్రక్రియ పూర్తవుతుందన్నారు. మీకు తెలిపిన ఈ వివరాలు నమోదు చేయకుంటే రాబోవు కాలంలో ధాన్యం అమ్ముకోవడానికి గాని, పంట బీమా కాని, ఈ-పంట ధ్రువపత్రం కాని, అన్నదాత సుఖీభవ డబ్బులు రైతుల ఖాతాలో పడే విషయంలో లబ్ధి చేకూరదన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనంలో ఉంచుకొని నమోదు చేయించుకొని అర్హులు కావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

మోదకొండమ్మ ఆలయానికి భక్తుల తాకిడి

మాడుగుల : ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు తాకిడి పెరిగింది. గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకోవాడానికి రావడంతో ఆలయ ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. అమ్మవారిని పూలు, నగలతో ప్రత్యేకంగా అలంకరించారు.